04122024-MAI-04_Layout 1 12/4/2024 3:39 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

బంగ్లా విపరీత ధోరణి

బంగ్లాలో రాజకీయ తుఫాను చెలరేగి షేక్ హసీనా ప్రభుత్వం పతనమై వందరోజులు దాటింది. ఈ వంద రోజుల్లో భారత్‌తో సంబంధాలు అంతకంతకూ దిగజారుతున్న సూచనలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. మైనారిటీ హిందువులపై పెరుగుతున్న దాడులు ఈ పరిస్థితికి కారణమని చెప్పాలి. అంతర్జాతీయ కృష్ణచైతన్య సంస్థ బంగ్లాదేశ్ విభాగం మాజీ సభ్యుడైన చిన్మయకృష్ణ దాస్‌ను ఇటీవల రాజధాని ఢాకాలో దేశ ద్రోహం నేరం కింద అరెస్టు చేయడం దీనికి పరాకాష్ఠ. మతోన్మాద శక్తులు హిందువులపై దాడులకు తెగబడుతుండటాన్ని ప్రశ్నిస్తున్న దాస్‌ను ప్రస్తుత బంగ్లా పాలకులు లక్ష్యంగా చేసుకున్నారు. తీవ్ర అభియోగాలతో ఆయనను జైల్లో పెట్టడమే కాకుండా న్యాయ సహాయం అందకుండా చేయడం ఆందోళన కలిగిస్తున్నది.

హిందువులతో సహా మైనారిటీలు అందరినీ కాపాడాల్సిన బాధ్యత తాత్కాలిక బంగ్లా సర్కారుపై ఉన్నదని భారత్ గుర్తుచేసింది. అయితే ఈ నిరసనలను, నివేదనలను బంగ్లాదేశ్ పట్టించుకున్నట్టు కనిపించడం లేదు. నిజానికి అధికార మార్పిడికి దారితీసిన ఆగస్టు సంక్షోభ కాలంలోనే హిందువులపై మెజారిటీ వర్గీయులైన ప్రజలు అమానుషమైన దాడులకు తెగబడ్డారు. ఆ తర్వాత కూడా చెదురు మదురుగా దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడుల గురించి భారత్‌లో పంపిణీ అవుతున్న సమాచారాన్ని రాజకీయ ప్రచారంగా తాత్కాలిక పాలకుడైన యూనుస్ కొట్టిపారేయడం గమనార్హం.

భారత్ అనుకూల నేతగా పేరున్న షేక్ హసీనాను గద్దె దించడంలో పాక్, చైనా అనుకూల శక్తులు కీలకపాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఆ శక్తులే ఇప్పుడు సైన్యం వత్తాసుతో యూనుస్‌ను ముందు పెట్టుకొని తమ ఎజెండాను అమలుచేస్తున్నాయి. ఆ ఎజండాలో భారత వ్యతిరేక ధోరణి కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. బంగ్లాదేశ్ విముక్తి కోసం పాకిస్థాన్‌పై యుద్ధం సాగించి మహోన్నత త్యాగాలు చేసిన భారత్‌కు ఇది బాధాకరమైన విషయమే. ప్రస్తుతం మన దేశంలో తల దాచుకున్న మాజీ ప్రధాని షేక్ హసీనాను తమకు అప్పగించాలని యూనుస్ జారీ చేస్తున్న తాఖీదులు హద్దులు మీరిన ప్రవర్తనగానే భావించాల్సి ఉంటుంది. ఎందుకంటే ఆయన ఎన్నికైన దేశాధినేత కాదు. అంతర్గత, విదేశీ వ్యవహారాలపై తీవ్ర ప్రభావం చూపే నిర్ణయాలు తీసుకునే అధికారం ఆయనకు లేదనేది తెలిసిందే. బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వాలకు మూడు నెలల్లో ఎన్నికలు నిర్వహించడం మినహా మరే పెద్ద బాధ్యతలు ఉండకపోవడం ఆచారంగా వస్తున్నది. కానీ, యూనుస్ ప్రభుత్వం అలాంటి ఉద్దేశమేదీ తనకు లేనట్టుగానే వ్యవహరిస్తుండటం ప్రమాదకరం. నాలుగేండ్ల వరకు తాత్కాలిక ప్రభుత్వం కొనసాగవచ్చని ఆయన విపరీత భాష్యాలు చెప్తున్నారు. గత మూడు ఎన్నికలు (2014, 2018, 2024) అవకతవకలు, బహిష్కరణలతో విమర్శలను ఎదుర్కొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు ఇప్పుడు సజావుగా ఎన్నికలు జరగాలని కోరుకుంటున్నారు. అదే సమయంలో దేశ సమస్యలను ఎదుర్కోవడంలో తాత్కాలిక ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ప్రజలు భావిస్తున్నారు. అల్లకల్లోలమై అరాచకానికి నెలవుగా మారిన బంగ్లాదేశ్‌లో శాంతి, సామరస్యాలను వీలైనంత త్వరలో పునరుద్ధరించి ఎన్నికలు నిర్వహించడం ఒక్కటే ప్రస్తుత సమస్యలకు పరిష్కారం. దేశ భవితవ్యాన్ని నిర్ణయించే బాధ్యతను ప్రజా ప్రభుత్వానికి అప్పగించి పక్కకు తప్పుకోవడమే తన కర్తవ్యమని యూనుస్ ప్రభుత్వం గుర్తించాలి. ఇందుకు అంతర్జాతీయ ఒత్తిడి తీసుకువచ్చేందుకు భారత్ దౌత్యపరంగా కృషి చేయాల్సిన అవసరం ఉన్నది.

ఉద్యమ స్ఫూర్తి చాటిన మహిళలు

బుద్దా మురళి

దాదాపు పదిహేనేండ్ల కిందట పత్రికల్లో ఒక ఆసక్తికరమైన వార్త వచ్చింది. కొంపల్లి నుంచి మేడ్చల్ రహదారికి ఆనుకొని ఓ కుటుంబానికి పదెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. అవసరం వచ్చి అందులో నాలుగెకరాలు అమ్ముకున్నారు. ఒకప్పుడు కొంపల్లి నుంచి మేడ్చల్ రోడ్ వరకు ద్రాక్ష తోటలున్న వ్యవసాయ భూమి, కాలక్రమంలో ఆ ప్రాంతం మహానగరంలో భాగంగా మారింది. దీంతో వ్యవసాయ భూములు కాస్తా కోట్ల రూపాయల విలువైన భూములుగా మారాయి.

నాలుగెకరాలు కొన్న వ్యక్తి ఆ భూమిలో విల్లాలు కట్టాడు. విల్లాల పక్కనే ఉన్న ఆరెకరాల్లో రైతు ఇంకా వ్యవసాయం చేస్తూనే ఉన్నాడు. 'నువ్వు అడిగిన ధర ఇస్తాను మిగిలిన ఆరెకరాలు కూడా నాకే అమ్ము' అంటూ ఆ వ్యక్తి రైతుపై అనేక రకాలుగా ఒత్తిడి తెచ్చాడు. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అనుసరించే బెదిరింపు టెక్నిక్‌లన్నీ ఉపయోగించాడు. అయినా, రైతు లొంగలేదు. ఆ బెదిరింపుల ఫలితంగా పోలీసు కేసులూ అయ్యాయి. 'పక్కన వ్యవసాయ భూమి ఉండటం వల్ల విల్లాలకు సరైన విలువ రావడం లేదు, నేనేమీ ఉచితంగా ఇవ్వమని అడగడం లేదు. అతను చెప్పిన ధర ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను' అని నాలుగెకరాలు కొన్న వ్యాపారి వాదన. భూ యజమాని అయిన రైతు వాదన ఇంకా ఆశ్చర్యం కలిగించింది. 'అప్పుడు డబ్బులు అవసరం ఉండటం వల్ల గత్యంతరం లేక నాలుగెకరాలు అమ్ముకున్నాను. ఇప్పుడు నాకు భూమి అమ్ముకోవాల్సిన అవసరం లేదు. అతను ఎంత డబ్బు ఇస్తే నాకెందుకు? ఈ భూమిలో మా తల్లిదండ్రులు, మా తాతల సమాధులున్నాయి. వాళ్లు తమ జీవితకాలం అంతా ఇక్కడే గడిపారు. మరణించిన తర్వాత కూడా వారిని ఇక్కడే సమాధి చేశాం. అతను నా పొలానికి ఇచ్చే కోట్ల రూపాయలతో నేను పెద్ద పెద్ద భవంతులు కొనవచ్చు.. మరోచోట వ్యవసాయ భూములు కొంటా నేమో కానీ, ఆ భవంతుల్లో, ఆ భూముల్లో మా తల్లిదండ్రులు, మా పూర్వీకుల అనుబంధం ఉండదు కదా?' అని భూమితో ఉండే అనుబంధాన్ని ఆ రైతు కళ్లకు కట్టాడు. అంతేకాదు, భూమిని అమ్మేదే లేదని తేల్చిచెప్పాడు.

> **ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారికి భూమి అంటే ఎంతకు కొన్నాం, ఎంతకు అమ్ముడుపోతుంది, ఎంత లాభం అనే లెక్కలు మాత్రమే ఉంటాయి. కానీ, రైతుకు వ్యవసాయభూమి అంటే తమ జీవితంలో ఒక భాగం. తన జీవితమే కాదు, తన తల్లిదండ్రులు, తమ పూర్వీకుల జీవితాలతో ముడిపడి ఉంటుంది. పెండ్లిళ్లు, తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు గత్యంతరంలేని పరిస్థితుల్లో రైతు వ్యవసాయ భూములు అమ్ముకుంటాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారికి రైతుల ఆలోచన అర్థం కాదు కూడా.**

నిర్మల్, వికారాబాద్ జిల్లాల్లో జరిగిన రెండు సంఘటనలను చూస్తే తమ భూములను కాపాడుకోవడానికి రైతులు ఎలాంటి తెగింపుకైనా సిద్ధమవుతారని పాలకులకు తెలిసివచ్చింది. నిర్మల్‌లో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో తమ జీవితాలు ప్రమాదంలో పడతాయని ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఈ ఉద్యమానికి సంబంధించి ఒక ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. మహిళల ధైర్యం, తెగింపు ఆసక్తి కలిగించింది. తమ భూముల కోసం తమ ఉనికి కోసం ఎంతటి నియంతలనైనా ఎదిరించే సత్తా తెలంగాణలో సామాన్యులకు ఉన్నదనే నమ్మకం కలిగింది. ఒక సాధారణ మధ్య వయస్సు మహిళ తన ముఖం కెమెరాల్లో పడకుండా ముఖం కప్పుకొని చేతిలో పురుగుల మందు బాటిల్ పట్టుకొని పోలీసులపైకి 'రండిరా రండి' అంటూ దూసుకువెళ్తూ పోలీసులను పరుగెత్తించింది. ఆ ఫొటో బాగా వైరలైంది. తన భూమిని దొర లాక్కోవడానికి ప్రయత్నిస్తే చాకలి ఐలమ్మ తిరుగుబాటు చేసింది. ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక ఉద్యమంలోని ఆ సాహస మహిళ చాకలి ఐలమ్మ విగ్రహం ఈ రెండు ఫోటోలు కలిపి సామాజిక మాధ్యమాల్లో బాగా వైరలైంది. ఆ మహిళ కట్టు బొట్టు, చాకలి ఐలమ్మ విగ్రహంలోని కట్టు బొట్టు ఒకే రీతిలో ఉన్నాయి. పాలకులు ఎంత బలవంతులైనా తిరగబడే తత్వం తెలంగాణలో ఎప్పుడూ ఉంటుందని, అది నిజాం కాలంలోనైనా, ఈ కాలంలోనైనా సజీవంగా ఉంటుందనిపించింది.

అదేవిధంగా వికారాబాద్ జిల్లా లగచర్లలో ఫార్మా పరిశ్రమ కోసం గిరిజనుల భూమి బలవంతంగా సేకరించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై స్థానిక గిరిజనులు తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. పచ్చని పొలాలను తొండలు గుడ్లు కూడా పెట్టని భూములు అంటూ స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటించడంతో మీడియాను తమ పొలాల్లోకి తీసుకువెళ్లి ఇవి తొండలు గుడ్లు పెట్టని భూములా? మీకు తిండి పెడుతున్న భూములా? అని గ్రామంలోని మహిళలు ప్రశ్నిస్తున్నారు. ఫార్మా పరిశ్రమ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత స్వయంగా ముఖ్యమంత్రి ఆ భూసేకరణ ఫార్మా కంపెనీ కోసం కాదు, పారిశ్రామిక వాడ కోసం అని మాట మార్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మహబూబ్‌నగర్ జిల్లాలో ఫార్మా సిటీ కోసం వందల ఎకరాలు సేకరించి అన్నీ సిద్ధం చేశాక కేవలం ఇగోతో ఆ భూమిని పక్కనపెట్టి మళ్లీ భూసేకరణను ప్రభుత్వం ఏ విధంగా సమర్థించుకుంటుంది. ప్రజల ఉద్యమం, తీవ్రస్థాయిలో వ్యతిరేకత వచ్చిన తర్వాత ఫార్మా పరిశ్రమ, భూసేకరణ కోసం ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేసి పారిశ్రామిక వాడ పేరుతో నోటిఫికేషన్ ఇచ్చారు. ముఖ్యమంత్రి అల్లుడికి సంబంధించి ఫార్మా కంపెనీ కోసం భూ సేకరణ జరుపుతున్నారనే ఆరోపణ జనంలోకి బాగా వెళ్లింది. ఎవరు అడ్డు వచ్చినా ఫార్మా పరిశ్రమ కోసం భూ సేకరణ జరుగుతుంది అని సీఎం సోదరుడు కెమెరాల ముందు ప్రకటించడం విశేషం.

పారిశ్రామిక వాడ అయినా, ప్రాజెక్టులు నిర్మించాలన్నా, ఫార్మా కంపెనీ అయినా భూములు సేకరించడం కొత్త కాదు. సేకరించాలి, కానీ ఒక ప్రజాప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా నిబంధనల మేరకు చట్టబద్ధంగా వ్యవహరించి తగు నష్ట పరిహారం ఇచ్చి బాధితులకు నచ్చజెప్పి భూములు సేకరించాలి. 'ఎవడు అడ్డు వచ్చినా తొక్కుకుంటూ వెళ్తాను, బుల్డోజర్‌తో తొక్కి భూములు సేకరిస్తాం' అని అహంకారంగా వ్యవహరిస్తే అది ప్రభుత్వం అనిపించుకోదు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు రైతుల నుంచి భూములు కొట్టేసే విధానం వేరు, రైతుల నుంచి ప్రభుత్వం భూములు సేకరించడం వేరు అనే విషయాన్ని పాలకులు గ్రహించాలి.

> **రైతులు తమ భూములను వదులుకోవడం అంటే తమ అస్తిత్వం కోల్పోవడంగా భావిస్తారు. తమ శరీరంలో ఒక భాగాన్ని వదులుకోవడంగా భావిస్తారు. రైతులకు వ్యవసాయ భూములతో అనుబంధాన్ని కేవలం డబ్బుతో లెక్కగట్టలేం. అయినా, ఎంతోమందికి ప్రయోజనం కలిగించే ప్రాజెక్టుల కోసం భూములు సేకరించాల్సి వస్తే దాన్ని రైతులకు వివరించాలి, వారిని ఒప్పించాలి కానీ, అధికారం చేతిలో ఉంది కదా అని తొక్కుకుంటూ వెళ్తామంటే.. అంతిమ అధికారం ప్రజల చేతుల్లోనే ఉంటుంది. వారికి అవకాశం వచ్చినప్పుడు వాళ్లూ తొక్కుతారు.**

లగచర్ల, నిర్మల్ ఈ రెండింటిలో ప్రభుత్వం ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారిలా వ్యవహరించింది. కానీ, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వంలా వ్యవహరించలేదనేది ముమ్మాటికీ సత్యం. తెలంగాణలోని సామాన్యుల్లో ఉద్యమ స్ఫూర్తి కొరవడలేదని నిరూపించే విధంగా లగచర్ల, నిర్మల్‌లోని సామాన్యులు, ముఖ్యంగా మహిళలు ఉద్యమించారు.

రాష్ట్రంలోని గురుకులాలు సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. నిర్వహణ, పర్యవేక్షణలోపం వల్లనే ఈ సమస్యలు తలెత్తుతున్నాయనడంలో సందేహం లేదు. ప్రభుత్వ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు, మధ్యాహ్న భోజనం అందజేసే ప్రభుత్వ పాఠశాలల్లో వరుసగా ఆహారం కలుషితమైన సంఘటనలు చోటుచేసుకుంటుండటం, విద్యార్థుల మరణిస్తుండటం బాధాకరం. నారాయణపేట జిల్లా, మాగనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ తర్వాత కూడా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో ఫుడ్ పాయిజనింగ్ జరగడం వల్ల వరుసగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ప్రతి గురుకుల విద్యాలయం లేదా హాస్టళ్లలో విద్యార్థుల రక్షణ వ్యవస్థను ప్రభుత్వం ప్రాథమిక స్థాయిలోనే పటిష్ఠంగా ఏర్పాటు చేయగలిగితే ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా ఉంటాయి.

మసకబారుతున్న గురుకులాలు

గురుకులాల నిర్వహణలో ప్రభుత్వం ఒంటెత్తు పోకడ అనుసరిస్తూ తమ పంథాలోనే వెళ్తున్నది. ఉపాధ్యాయుల, విద్యావేత్తలు, తల్లిదండ్రుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం లేదు. గురుకులాల్లోని ఉపాధ్యాయులు స్థానికంగా ఉండటం లేదు. ఉపాధ్యాయుల జీతాలు, మామూలు డే స్కూల్ ఉపాధ్యాయుల జీతాల కన్నా తక్కువగా ఉంటున్నాయి. గురుకుల విద్యాలయాలను పర్యవేక్షించడానికి విద్యాశాఖకు సంబంధించి పర్యవేక్షణాధికారులు అందుబాటులో లేకపోవడం శోచనీయం. ఏదైనా ఘటన జరిగినప్పుడు మాత్రమే అధికారులు హడావుడిగా వచ్చి మీడియా ముందు కనపడుతున్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా, నివారించడానికి ముందస్తుగా ఏ మాత్రం ప్రయత్నాలు జరగడం లేదు. వీటన్నింటి ఫలితంగానే తెలంగాణ రాష్ట్రంలో ఉన్న గురుకుల విద్యాలయాలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, సంక్షేమ హాస్టళ్లతో కలిపి ఈ ఏడాది విద్యార్థుల మరణాలు 48కి చేరాయి. ఇందులో 23 బలవన్మరణాలు, 8 అనుమానాస్పద ఘటనలు కాగా ఫుడ్ పాయిజన్‌తో నలుగురు మృతి చెందారు. అనారోగ్యంతో 13 మంది విద్యార్థులు చనిపోయారు. ఎస్సీ గురుకులాల్లో, ఇతర హాస్టళ్లతో కలిపి దాదాపు 886 మంది అస్వస్థతకు గురయ్యారు.

ప్రభుత్వం ఇకనైనా పై విషయాలను పరిగణనలోకి తీసుకొని, విద్యార్థుల సంరక్షణకు పాటుపడాలి. సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు అనుబంధంగా ప్రధానాచార్యుల పర్యవేక్షణలో వార్డెన్‌లను అందుబాటులో ఉంచాలి. వంటవాళ్లను ఇప్పటికీ కాంట్రాక్టర్‌లు నియమిస్తున్నారు. అలా కాకుండా ప్రభుత్వమే వాళ్లను నియమిస్తే, వారు భయం, బాధ్యతతో వ్యవహరిస్తారు. వంట సరుకుల నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన బాధ్యతను పర్యవేక్షణాధికారులు తీసుకోవాలి. సంబంధిత శాఖలలో ఉన్న సీనియర్ అధికారులనే ప్రభుత్వం పర్యవేక్షణాధికారులుగా నియమించాలి. సంక్షేమ హాస్టళ్లకు సంబంధించి డైట్‌చార్జీలు సకాలంలో రావడం లేదు, ప్రతి నెల విద్యార్థికి రావల్సిన కాస్మాటిక్ చార్జీలు సకాలంలో రావడం లేదు. వీటిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాలి.

> **ప్రభుత్వంలో అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎందరో ఉన్నా, ఈ ఆధునిక సమాజంలో ప్రభుత్వ ఉద్యోగులన్నా, ప్రభుత్వ ఉపాధ్యాయులన్నా చిన్నచూపు ఉన్నది. కొంతమంది ఉద్యోగులు నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడమే అందుకు కారణం. కాబట్టి గురుకులాల్లో పనిచేసే ఉద్యోగులు విధి నిర్వహణల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి. ప్రభుత్వం అధిక నిధులు కేటాయించకపోవడం, కాంట్రాక్టర్లకు సకాలంలో నిధులు విడుదల చేయకపోవడం కూడా గురుకులాల సమస్యలకు ప్రధాన కారణాలు. గురుకుల పాఠశాలల నిర్వహణలో విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాములను చేయాలి. అప్పుడే ఆహారంలో నాణ్యత పెరుగుతుంది.**

ప్రైవేటు యాజమాన్యాలు భారీ మొత్తంలో స్కూల్ ఫీజులు వసూలు చేస్తుండటం కారణంగానే పేద విద్యార్థులు ప్రభుత్వ గురుకులాలను ఆశ్రయిస్తారు. ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలి. అందుకే ప్రభుత్వం ఉచిత విద్య, హాస్టల్ సదుపాయాలను ప్రతి పేద విద్యార్థికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలు సత్వరమే పరిష్కారమై, వాటిలో విద్య, ఆహార నాణ్యత పెరుగుతుందని ఆశిద్దాం.

సీవీవీ ప్రసాద్
8019608475
(వ్యాసకర్త: విశ్రాంత ప్రధానాచార్యులు)

నాడు నీళ్లొస్తే.. నేడు కన్నీళ్లొస్తున్నాయి

వర్ధెల్లి వెంకటేశ్వర్లు

2018, ఫాల్గుణ మాసం.. కోడికూత జాము. పాలమూరు బస్సెక్కి తెలకపల్లికి పయనం గట్టిన. పల్లెలు, పంట పాలాల నిండా పొగమంచు పరుచుకున్నది. కండ్లు పొడుచుకొని చూసినా పల్లేదో.. పంట పాలమేదో కనిపించనంత దట్టంగా మంచు పట్టింది. చెట్లు, చేమ, గడ్డి, గాదం, తీగలు ప్రకృతి ప్రతి మూల రూపాల మీద మంచు బిందువుల పెత్తనం సాగుతున్నది. సంకలు లేపితే చలి ఈడ్సి తంతున్నది. చేతులు దగ్గరికి ముడ్సుకొని బస్సు సీట్లోనే అడ్డమొరిగి కండ్లు మూసుకుంటే.. జ్ఞాపకాల దొంతరలు తెరలుగా తెరలుగా మదిలో మెదులుతున్నాయి.

ఏడాది బర్సాది

కాళేశ్వరం, మల్లన్నసాగర్, కొండపోచమ్మ, సీతారామసాగర్, భీమా, నెట్టెంపాడు ప్రాజెక్టు అనుమతుల కోసం కేసీఆర్ ఎక్కే గడప, దిగే గడపలకు లెక్కే లేదు. కాలచక్రం గిర్రున తిరిగింది.. మూడేండ్లు గడిచాయి. ఈ లెక్కన చూస్తే కృష్ణా జలాలు చెరువుల్లోకి మళ్లి, కల్వకుర్తి లిఫ్టు పరిధిలో ఉన్న తెలకపల్లి చెరువు కూడా నిండాలి కదా..! ఊరంచున పడావు పడిన భూములు ఈ పాటికి పచ్చబడాలి..! నా మనుసులోకి ఆ ప్రాంత ఆలోచనలు చొరబడ్డాయి. ఇదిగో ఈ ఆలోచనలతోనే పాలమూరు బస్సెక్కిన. తెలకపల్లితో నాది 18 ఏండ్ల అనుబంధం. ఊరంచునే పెద్ద చెరువు. పేరుకే పెద్దచెరువు కానీ, చుక్క నీళ్లు నిలబడింది లేదు. కంపదార చెట్లు, లొట్టపీసు పొదలతో నిండి ఉండేది. బతుకమ్మ నిమజ్జనానికి తప్ప దానితో ఊరుకు ఉపయోగం లేదు. మేతకు దిక్కులేక సావుకు దగ్గరైన పశువుల చర్మం ఒలుచుకొని ఊరి చర్మకారులు జంతు కళేబరాలను, బరెంక బొక్కలను సేద్యం లేని భూముల్లోకి విసిరేసేవాళ్లు. వాటికోసం రాబందులు వచ్చి వాలేవి. రాబందులను దగ్గర నుంచి నేను చూసింది తెలకపల్లిలోనే. ఈ బీడుబడ్డ పంట భూముల నుంచి పశ్చిమంగా పరుగు దూరం పోతే ప్రజాకవి గోరటి వెంకన్న సంచారజీవే. తెలకపల్లి ఊరంచున ఈత తోపులుండేవి. స్వచ్ఛమైన కల్లు దొరికేది. అది తాగిన వెంకన్న గొంతు నుంచి జాలువారే రాగానికి సురులు, అసురులైనా వంత పాడాల్సిందే.

తెలంగాణను విస్మరించిన ఆంధ్రా పాలనలో కరువు ఆవరించి ఈతవనం ఎండిపోయింది. పాలమూరును చంద్రబాబు దత్తత తీసుకున్నట్టు ప్రకటించిండు కానీ, రూపాయి ఖర్చుచేయలేదు. ఊరు వల్లకాడైంది. పాలమూరంతా చావు డేరయింది. రైతు ఆత్మహత్యలు, వృద్ధుల ఆకలిచావులకు అడ్డాగా మారింది. జనం వలసలు పోయిండ్రు. ఈ గోస తట్టుకోకనే 'పల్లే కన్నీరు పెడుతుందో' అని గోరటి కన్నీరు మున్నీరుగా విలపించిన జ్ఞాపకాల తెరలకు అడ్డం పడుతూ... బస్ కండక్టర్ 'రాకొండ.. రాకొండ' అని కేక పెట్టిండు. దిగ్గున మేల్కి తట్టింది.. నలిసిన కండ్లు రాకొండ శివారులోని టప్పమర్రి కోసం వెతుకుతున్నయి. రెండు శతాబ్దాల కాలం నాటి మర్రి

అది. వెనుకటి రోజుల్లో శ్రీశైలం వెళ్లే యోగులకు, సిద్ధులకు, బైరాగులకు ఆశ్రయమిచ్చిన మహావృక్షం. వరుస కరువులకు టప్పమర్రి తలవంచింది. దాని ఆనవాళ్ల పొడ జూసుకుంటా నాటి బీడు భూముల వైపు చూస్తే.. కనురెప్పలు వాల్చనియ్యని అద్భుత దృశ్యం. కనులు నమ్మలేనంత ఆశ్చర్యం. మూడేండ్ల కింద కేసీఆర్ చెప్పిన ప్రతి మాటకు వాస్తవ రూపం. నాడు మృత కళేబరాల కోసం రాబందులు వాలిన నేలమీద జీవ వైవిధ్యం పరిఢవిల్లుతున్న సద్దృశ్యం. తీరొక్క కొంగ జాతులు ఎగురుతున్న అద్భుతం కనిపించింది. పొదలు, తుప్పలు, కంపదారలేవీ కనిపించలేదు. వరి మళ్లతో ఎవుసం జోరు మీదుంది. వేసంగి కరిగట్టుకు మడులు దున్నుతున్నరు. బురద మట్టిలోంచి వచ్చే పురుగుల కోసం గుడ్డి కొంగలు ఒంటి కాలుమీద జపం చేస్తున్నయి. ఎరగారు కొంగలు.. ఆలేటి కొంగలు.. పెద్ద బూడిద కొంగలు.. నల్లకాళ్ల కొంగలు.. నలుపు రెక్కల కొంగలు.. నల్ల మెడ కొంగలు.. నత్తగొట్టు కొంగలు.. తెల్లరెక్కల కొంగలు.. తెల్ల వంకర ముక్కు కొంగలు.. పాముతల నీటి కాకులు గుంపులు పొలం మీదకు వచ్చి వాలుతున్నయి. రైతు అదిలిస్తే గాల్లోకి ఎగురుతున్నయి. అప్రయత్నంగానే పెద్ద చెరువు కట్టమీదికి మనుసు మళ్లింది. కట్టెక్కి చూస్తే.. నిండు గంగాళంగా మారిన సకల జీవకోటికి ఆదెరువు ఆ చెరువు.

60 ఏండ్ల దరిద్రాన్ని కడిగిపారేసి పచ్చబడ్డ తెలంగాణ ఆనవాళ్లకు పాలమూరు ఒక్కటి చాలు. నాడు కేసీఆర్ చెప్పినట్టే 2018 ఖరీఫ్ నాటికే కల్వకుర్తి ఎత్తిపోతల నుంచి 1.6 లక్షల ఎకరాలకు, నెట్టెంపాడు ద్వారా 1.2 లక్షల ఎకరాలకు, భీమా నుంచి 1.4 లక్షల ఎకరాలకు, కోయిల్‌సాగర్ ద్వారా 80 వేల ఎకరాల ఆయకట్టుకు నీళ్లిచ్చి మాట నిలబెట్టుకున్నరు. తొలి దశ మిషన్ కాకతీయతో 62,899 ఎకరాలకు, రెండో దశ కింద 94,309 ఎకరాలకు, మూడో దశ ద్వారా 65,840 ఎకరాలకు, ఆఖరి దశతో 45,289 ఎకరాల కలిపి చెరువు కింది 2.68 లక్షల ఎకరాలకు నీళ్లందినయి. రాష్ట్రమంతటా రూ.9,155 కోట్లతో 27,627 చెరువులను పునరుద్ధరిస్తే.. రాష్ట్రవ్యాప్తంగా జల పెరిగింది. ఆ బలంతో 15.05 లక్షల ఎకరాల్లో పచ్చదనం విచ్చుకున్నది. కాళేశ్వరం, ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి, నిజాంసాగర్, సింగూరు, ఎగువ మానేరు, దిగువ మానేరు, కడెం, సీతారామ, భక్తరామదాసు, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమా, ఎలిమినేటి మాధవరెడ్డి పెండింగ్ ప్రాజెక్టులకు రూపం పోసి 2022-23 నాటికి ఖరీఫ్, రబీ సీజన్లు కలిపి ఏకంగా 1.22 కోట్ల ఎకరాలు సాగుకు అచ్చుగుద్దినట్టి, 3.62 కోట్ల టన్నుల ధాన్యమిచ్చే ఆకుపచ్చ తెలంగాణకు హామీ ఇచ్చి కేసీఆర్ దిగిపోయారు.

కొత్త పాలకులు ఉన్న వనరులను పోతం జేసి అన్నదాతకు మరింత జవం ఇస్తారేమోననుకుంటే.. ఉన్న ప్రాజెక్టుల ఉసురు తీస్తున్నరు. ఆకుపచ్చ తెలంగాణపై కేసీఆర్ సంతకాన్ని చెరిపే విభ్రమక తహతహలాడుతున్నరు. అందుకే కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం ఎండబెట్టింది. అటు గోదావరి మీది కాళేశ్వరం ఇటు కృష్ణా మీది పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలు, కల్వకుర్తి ప్రాజెక్టులను పండబెట్టింది. ఏడాది కాపురం పదేండ్ల ఎన్కకుపోయింది. యాళ్ల తప్పిన కరెంటయ్యింది. చెరువులకు నీళ్లొస్తయని ఎదురుచూస్తుంటే.. కండ్లళ్ల నీళ్లొస్తున్నయి. ఎటుజూసి నా ఎండుగాలమే.. రైతు ఎవుసం గాసానికే ఎల్లేటట్టు లేదు. జూరాల, భీమా, నెట్టెంపాడు రన్నింగ్ ప్రాజెక్టులను క్లోజింగ్ ప్రాజెక్టులుగా మార్చేసిన్రు. గతేడాది యాసంగిలో భీమా ప్రాజెక్టు కింది ఆయకట్టుకు ప్రభుత్వం క్రాప్ హాలీడే ప్రకటించింది. మళ్లీ ఈ ఏడాది అదే పరిస్థితి. పాలమూరు ప్రాజెక్టు కింది వట్టెం రిజర్వాయర్ పంపు మోటర్లు మునిగిపోయినయి. వాటిని ఇప్పటివరకు పట్టించుకోలేదు. 88 పిల్లర్ల మీద కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుకు రెండు పిల్లర్లు పగ్రెలు పాస్తే.. ఆ పగ్రెల్లోకి పురుగులు దూర్చి రాజకీయం చేసిన్రు. నిండు కుండ తీరు కాళేశ్వరం ప్రాజెక్టుకు మసిపూసి పడావుబడ్డదని ప్రజలను మత్పరించే పాచికలు వేసిన్రు. ఎన్కటికో మాటున్నది.. 'తంతెకోడు.. మంతెకోడు ముదనష్టపోడు మోపైతడని' గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నానుడి. మన తంతెకోడు మోపైండు, మనం మరో నాలుగేండ్లు భరించక తప్పదు.

> **కేసీఆర్ రాజనీతిజ్ఞుడు. పాణము, పట్టము ఎప్పటికీ స్థిరం కాదని నమ్మిన స్థితప్రజ్ఞుడు. రాచరిక చరిత్ర, రాజకీయ చతురత తెలిసిన జ్ఞా